క్లుప్తంగా

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి అందుకున్న చిన్నారులతో యువనేస్తం అధ్యక్షుడు మునిశేఖర్

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లి ఎస్టీ కాలనీ పాఠశాల విద్యార్థులకు బాంబినో పాస్టఫుడ్స్ సహాయంతో ఆదివారం యువనేస్తం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.మునిశేఖర్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. అలాగే పిల్లలకు బిస్కెట్లు అందజేశారు. గిరిజన పిల్లలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్న ఉద్దేశంతో తమ వంతు సామాజిక బాధ్యతగా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో యువనేస్తం ట్రస్ట్ అధ్యక్షుడు వినోద్, మండల కోఆర్డినేటర్ అరుణ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ డిప్యూటీ సీఎంకు సాదర స్వాగతం



భట్టి విక్రమార్కకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

రేణిగుంట: తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం ఆదివారం ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో తిరుమలకు వెళ్లారు.

తొట్టంబేడు ఎస్ఐగా రామాంజనేయులు

ట్టంబేడు: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా రామాంజనేయులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా తొటబేడుకు బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

ఉలవచేనులో కార్డన్ సెర్చ్



కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

సత్యవేడు: మండల కేంద్రంలోని ఉలవచేను ప్రాంతంలో ఎస్ఐ రామస్వామి, పోలీసులు కలసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆదివారం 20 వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వాహనదారులకు రోడ్డు సేఫ్టీ, వాహన సంబంధిత నేరాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రశేఖర్ నాయుడు, హెడ్ కానిస్టేబుల్ ప్రతాప్, భాస్కర్, శ్రీధర్, చెల్లయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందిస్తా!



హర్షిత్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

వరదయ్యపాళెం: వైద్యవిద్యను అభ్యసించి మంచి వైద్యుడిగా పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తానని నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి హర్షిత్ తెలిపారు. మండలంలోని సంతవేలూరుకు చెందిన ఉపాధ్యాయులు ఆనంద్, రమాదేవి కుమారుడు టి.హర్షిత్ నీట్‌లో 609 మార్కులతో ఓపెన్ విభాగంలో జాతీయ స్థాయిలో 876వ ర్యాంకు, కేటగిరి విభాగంలో 22వ ర్యాంకు సాధించారు. ప్రతిష్టాత్మకమైన కాలేజీలో వైద్యవిద్య పూర్తి చేసి మంచి వైద్యుడిగా సేవలందిస్తానని తెలిపారు. తల్లిదండ్రులు ఆనంద్, రమాదేవి హర్షిత్‌కు స్వీట్స్ తినిపించి, అభినందించారు.

లారీ దగ్ధం



కాలుతున్న లారీ

రేణిగుంట: శ్రీసిటీ నుంచి హోసూరుకు పేపర్ లోడ్‌తో వెళుతున్న లారీ ఇంజిన్, క్యాబిన్‌కు మధ్యలో మంటలు చెలరేగడంతో దగ్ధం అయ్యింది. స్థానికుల కథనం మేరకు.. రేణిగుంట మండలం లోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై గాజులమండ్యం పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున పేపర్ లోడ్‌తో వెళుతున్న లారీలో మంటలు రావడంతో డ్రైవర్ వెంటనే లారీని ఆపి, దూరంగా వెళ్లిపోయాడు. గాజుల మండ్యం పోలీసులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందజేయడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే లారీ దగ్ధం అయ్యింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గాజుల మండ్యం పోలీసులు తెలిపారు.

చక్కటి సేవ.. పక్కదోవ



వరదయ్యపాళెం మండలంలోని మత్తేరిమిట్ట సచివాలయం

- వలంటీర్లకు రూ.10 వేల వేతనమని మోసం
- సచివాలయాల్లో సిబ్బంది సంఖ్య తగ్గింపు
- నిర్వీర్యమవుతున్న సచివాలయ వ్యవస్థ

ఒక్కో వలంటీరుకు రూ.10 వేలు వేతనం ఇస్తామంటూ హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వలంటీర్ల వ్యవస్థపై కక్షగట్టి నిర్వీర్యం చేసింది. అంతటితో ఆగని కూటమి సర్కార్ సచివాలయ వ్యవస్థపై విషం కక్కింది. సత్యవేడు నియోజకవర్గంలో ప్రభుత్వ పాలనలో మార్పులు తెచ్చింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన తీసుకువస్తే.. అది నేరంగా భావించిన కూటమి ప్రభుత్వం వాటిని కుదించి ఉద్యోగులను ముప్పుతిప్పలు పెడుతోంది. సామాన్య ప్రజలను కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిప్పిస్తూ ఇబ్బందులకు గురి చేస్తోంది. ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించకుండా అనేక ఆంక్షలు విధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తోంది.

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ దిశగా నియోజకవర్గంలోని 7 మండలాల్లో 97 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసింది. ఈ వ్యవస్థతో మండల కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా ఎక్కడికక్కడ ప్రజల సమస్యలు తీర్చాయి. ప్రయాణ భారం, వృథా సమయం తప్పింది. గ్రామ స్వరాజ్యం దిశగా ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చి ప్రభుత్వ సేవలను దగ్గర చేసింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజల వద్దకు పాలనకు తూట్లు పొడుస్తూ ప్రజలపై కక్ష్యపూరితంగా వ్యవహరిస్తోంది.

సచివాలయాల కుదింపు

అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తవుతున్న తరుణంలో సచివాలయ వ్యవస్థపై కుట్రలకు పాల్పడుతోంది. ఆ దిశగా రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా మ్యాపింగ్ చేస్తున్నారు. సాంకేతిక విభాగానికి చెందిన ఉద్యోగులు గ్రామ రెవెన్యూ అధికారి, ఏఎన్ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వ్యవసాయ(అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్), పశుసంవర్ధక (వెటర్నరి, ఫిషరీష్), ఎనర్జీ అసిస్టెంట్ ఉద్యోగులు ఏడుగురు, సాధారణ పరిపాలనకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి–గ్రేడ్ 1–5, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, గ్రామ మహిళ పోలీసు ఉద్యోగులు ఐదుగురు ఉంటారు. ఉద్యోగుల సంఖ్య తగ్గిపోనుంది. ఫలితంగా సేవలు పొందడానికి కష్టాలు తప్పవు.

గతంలో సేవలు అనేకం

గత ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా 545 రకాల సేవలను గ్రామ సచివాలయంలో ప్రజలు పొందేవారు. ఏ పనికైనా సచివాలయానికి వెళితే ఉద్యోగులు వాటికి సంబంధించిన పనులు చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొత్తం సేవల్లో కొన్నింటిని మాత్రమే అందిస్తోంది. అందులో ఎక్సైజ్ అండ్ రెవెన్యూకు సంబంధించి 34, పౌరసరఫరాలు 2, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం 3, జీఎస్ డబ్ల్యూఎస్ 4, మానవ వనరులు 1, పీఆర్ అండ్ మున్సిపల్ 1, (ఇందులోనే 25 అంశాలు పెట్టారు), సదరం 1, మైన్స్ 1, విపత్తు, అగ్నిమాపక 3, రవాణా 5, ఏపీఓఎస్ఎస్ 2, చెల్లింపుల సేవలు 3 మీసేవల్లో కూడా అందుబాటులో ఉండేవి. ఇవిపోగా మిగిలిన సేవలన్నీ కూటమి ప్రభుత్వం బంద్ చేసేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 545 సేవలను ప్రజలు పొందడం జరిగేది. ఇప్పుడు 173 సేవలు మాత్రమే అందుబాటులో పెట్టారు. మిగిలిన 372 ప్రభుత్వ సేవలు ప్రజలకు దూరం చేశారు. ఈ సేవల కోసం ప్రజలు మీసేవ కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

వలంటీర్ వ్యవస్థ రద్దు

ప్రస్తుత కూటమి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను రద్దు చేసింది. దీంతో నియోజకవర్గంలోని 7 మండలాల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నియమించిన 1439 మంది గ్రామ వలంటీర్లను తొలగించింది. ఇంటింటికి వెళ్లి సేవలు అందించే ఈ వలంటీర్లు ఇప్పుడు కనిపించడం లేదు. కూటమి సర్కార్ తమకు రూ.10 వేల వేతనం ఇచ్చి గౌరవిస్తుందని ఆశించిన వలంటీర్ల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్ల చల్లింది. వేతనం మాట దేవుడెరుగు, అసలు వ్యవస్థనే అచేతనావస్థలోకి నెట్టేశారు. దీనిపై వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ప్రతిఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకొంటూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసిన వలంటీర్ల వ్యవస్థను దూరం చేయడంతో ప్రజలకు సేవలు దూరమై.. ఇప్పుడు ప్రతి పనికి కార్యాలయాలు, దళారులు, నాయకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

సత్యవేడు నియోజకవర్గంలో వలంటీర్లు, గ్రామ సచివాలయాల వివరాలు

మండలం	వలంటీర్లు	సచివాలయాలు
పిచ్చాటూరు	175	10
నాగలాపురం	175	12
సత్యవేడు	271	17
కేవీబీపురం	217	19
బీఎన్‌కండ్రిగ	183	14
నారాయణవనం	157	12
వరదయ్యపాళెం	231	13

సేవలు తగ్గాయి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏ పథకం పొందాలన్నా.. ఏ సేవ కోసమైనా సచివాలయం వెళ్లి పనులు చేసుకునే వాళ్లం. సమస్య అక్కడే చెప్పుకుని పరిష్కారం పొందడం జరిగేది. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. పొందుతున్న సేవలను తగ్గించేసి ప్రాధాన్యం లేకుండా చేస్తున్నారు. ఈ వ్యవస్థను పటిష్టం చేయాలి.

–సుబ్రమణ్యం, కాంబాకం

తిరగలేక పోతున్నాం



వలంటీర్లు లేకపోవడంతో పనులు చేయించుకునేందుకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మా పనులు చూసుకొంటూ ఇబ్బంది లేకుండా ప్రభుత్వ సేవలు, పథకాలు పొందేవాళ్లం. ప్రస్తుతం ఏ పని కోసమైనా పనులు మానుకుని కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల చాలా నష్టపోతున్నాం. –గురవయ్య, కళత్తూరు, వరదయ్యపాళెం మండలం

నమ్మించి మోసం



వలంటీర్లను కొనసాగిస్తామని, రూ.10 వేల వేతనం ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇస్తే నమ్మాం. అధికారంలోకి వచ్చాక వలంటీర్ల గురించి పట్టించుకోవడం లేదు. వలంటీర్ల బాధ్యతలు చేపట్టాక ప్రజలకు సేవ చేస్తున్నామన్న తృప్తి కలిగింది. దీనిపై కూటమి ప్రభుత్వం వలంటీర్లకు న్యాయం చేయాలి.

–రిబ్కా, రాచర్ల, వరదయ్యపాళెం మండలం

బీసీల అభ్యున్నతి వైఎస్సార్ సీపీ తోనే సాధ్యం



రమణయ్యయాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఏర్పేడు: బీసీల అభ్యున్నతి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని, ఆ పార్టీ బీసీలకు పెద్దపీట వేసి బీసీ నాయకులకు సముచిత స్థానం కల్పిస్తుందని వైఎస్సార్ సీపీ ఏర్పేడు మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్యయాదవ్ అన్నారు. మండలంలోని పాత వీరాపురంలో ఆదివారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్యయాదవ్, ఉపాధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామయ్య ఆచ్చారి, కార్యదర్శి మునిరత్నంను బీసీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి బీసీలకు వైఎస్సార్ సీపీలో మంచి పదవులు రావడానికి కృషి చేశారన్నారు. మండలంలో బీసీలందరం కలసికట్టుగా పనిచేసి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం నాయకులు కందప్పగారి వినోద్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, దామోదర్‌రెడ్డి, మణి, మునిశేఖర్, కేశవులు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ అభిమాని మృతి బాధాకరం

బుచ్చినాయుడుకండ్రిగ: మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమాని నీర్పాకోట గ్రామానికి చెందిన గాలి సుబ్బలక్ష్మమ్మ (62) అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటిరాజేష్ తెలిపారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, సుబ్బలక్ష్మమ్మ ప్రతి సంవత్సరం సంక్రాంతికి వైఎస్సార్ చిత్రపటాన్ని పూలతో అలంకరించి, భక్తిశ్రద్ధలతో పూజలు చేసి అభిమానం చాటుకుందని గుర్తుచేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె చూపిన నిస్వార్థ ప్రేమకు నిజమైన భక్తికి ఘన నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. ఆ కుటుంబానికి పార్టీ సహాయ సహకారాలుంటాయన్నారు.

పాఠశాలల వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ నాగార్జునరెడ్డి

శ్రీకాళహస్తి: రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు ప్రైవేటు పాఠశాలల వాహనాలను సీఐ నాగార్జునరెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో బస్సులను మంచి కండిషన్‌లో ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని బస్సులను ఎప్పటికపుడు తనిఖీ చేసి, ఎలాంటి మరమ్మతులు లేకుండా చూసుకోవాలన్నారు. పాఠశాలల బస్సులు నడిపే డ్రైవర్లు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని తెలిపారు. అలాగే డ్రెస్‌కోడ్ పాటించాలన్నారు. తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు.

బీఎన్‌కండ్రిగలో ఐఐటీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్

బుచ్చినాయుడుకండ్రిగ: కర్ణాటకలోని రాయచూర్ ఐఐటీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ బొల్లినేనిరాజగోపాల్ నాయుడు తన సోదరి భర్త అయిన ఎస్ఐ విశ్వనాథనాయుడి నివాసానికి విచ్చేశారు. ఈయన మధ్యప్రదేశ్ సీఎస్‌గా సేవలందించి విరమణ పొందారు. తన విధుల్లో భాగంగా తిరుపతి ఐఐటీ డైరెక్టర్‌ను ఆదివారం కలిసి, కళాశాలలోని వసతులను పరిశీలించారు. సమీపంలోని బంధువు అయిన ఎస్ఐ విశ్వనాథనాయుడు కలిసి వెళ్లారు. ఈయన ఇద్దరు కుమార్తెల్లో ఒకరు ఐపీఎస్, మరొకరు ఐఆర్ఎస్ అధికారులుగా సేవలందిస్తున్నారు.

ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి

తొట్టంబేడు: అన్నదాత సుఖీభవ కోసం అర్హులైన రైతులందరూ ఈకేవైసీ చేసుకోవాలని తొట్టంబేడు మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమకు సమీపంలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది వద్దకు వెళ్లి వేలిముద్రలు వేసి, ధ్రువీకరించుకుంటేనే అన్నదాత సుఖీభవ సొమ్మును ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20 వేలు జమ చేస్తుందని తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం వాటా రూ.6 వేలు రైతు ఖాతాలకు జమ అవుతుందని తెలిపారు. మండలంలోని 41 రెవెన్యూ గ్రామాలలో 5,755 మంది రైతులు అర్హులుగా ఉన్నారని తెలిపారు. ఈ నెల 20 వ తేదీ లోపల ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని, చేసుకోకపోతే అన్నదాత సుఖీభవ సొమ్ము జమ కాదని తెలిపారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ

తొట్టంబేడు: మండలంలోని పాయ్య పంచాయతీలోని గాబచేను గ్రామంలో సాలాపాక్షి వెంకటయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు సతీమణి, మండల ఎంపీపీ నిర్మలమ్మ అక్కడికి చేరుకుని వెంకటయ్య మృతదేహానికి పూలమాల వేసినివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. దహన క్రియల ఖర్చుల నిమిత్తం తన వంతు సాయం చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరులో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో నారాయణాద్రి హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆమె శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలను పాటించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ఈ శిబిరంలో సుమారు వంద మందికి పైగా వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అరవై మందికి ఉచితంగా ఈసీజీ తీసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణాద్రి హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ కీర్తన, దీన కుమార్, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థశి పూజలు



హోమ పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజిఅంజి వినాయకస్వామి ఆలయం వద్ద ఆదివారం సంకటహర చతుర్థశి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజలను ప్రతి కుటుంబం నిర్వహించుకునేలా ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించి, విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు.

భూ వివాదంపై కేసు నమోదు

రేణిగుంట: మండలంలోని గుత్తివారిపల్లి హరిజనవాడలో భూ వివాదంపై కేసు నమోదు చేసినట్లు రేణిగుంట పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. గుత్తివారిపల్లి హరిజన వాడకు చెందిన కిరణ్ కుమార్ భార్య ఆదివారం ఇంట్లో ఉన్న సమయంలో ఆమె చిన్న మామ కుమారులైన నిఖిల్, భరత్, అతని స్నేహితులు వారి ఇంటి వద్దకు వచ్చి ప్రహరీ గోడ నిర్మాణం ఎందుకు చేశారని గొడవకు దిగి, దాన్ని కూల్చివేసి, తర్వాత వారి ఇంటి ఎదుట మొత్తం తవ్వి వేశారు. ఇంకోసారి ప్రహరీ గోడ నిర్మిస్తే అందరిని చంపుతామని బెదిరించి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సంఘటనపై బాధితురాలు రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎండీ పుత్తూరు పశువైద్యాధికారిగా శిల్పారెడ్డి



ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరు పశువైద్యశాల పశువైద్యాధికారిగా డాక్టర్ శిల్పారెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రమైన ఏర్పేడులో పశువైద్యాధికారిగా పని చేసిన శిల్పారెడ్డి సాధారణ బదిలీల్లో భాగంగా మండలంలోని ఎండీ పుత్తూరుకు బదిలీ అయ్యారు. ఏర్పేడు పశు వైద్యశాలలో వైద్యాధికారిగా పని చేసిన శిల్పారెడ్డి రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించి, పాడి రైతుల మన్ననలు అందుకున్నారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని ఎండీ పుత్తూరు పశు వైద్యశాల పరిధిలోని గ్రామాల పాడి రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తామని తెలిపారు.

కార్మిక వర్గం కదం తొక్కాలి



ర్యాలీ చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీకాళహస్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక నిర్ణయాలకు నిరసనగా కదం తొక్కాలని, జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం సత్తా చాటాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి హరినాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ శ్రీకాళహస్తి నియోజకవర్గ మూడో మహాసభలు ఆది, సోమవారాల్లో పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో ప్రారంభమయ్యాయి. మొదటి రోజైన ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా అంబేడ్కర్ భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్‌కోడ్‌లను అమల్లోకి తీసుకురావడం దుర్మార్గపు చర్య అన్నారు. దీని వల్ల కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు కోల్పోతారని తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో కూటమి సర్కార్ క్యాబినెట్‌లో 8 గంటల పనివిధానాన్ని రద్దు చేసి, 10 గంటలు పని చేయాలని సవరణ చేయడం సిగ్గుచేటన్నారు. చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఎక్కువ అయ్యాయని తెలిపారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో ఎంఈఓ–2గా వ్యవహరిస్తున్న ఓ అధికారి అవినీతి, అరాచకాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, అతనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, జనమాల గురవయ్య, కత్తి రవి, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు మురళి, వైఎస్ మణి, జిల్లా ఆఫీస్ బేరర్స్ చాముండేశ్వరి, సిహెచ్ శివకుమార్, నియోజకవర్గ నాయకులు కార్తీక్, గోపి, శివ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చారులత, నాగరాజు, ప్రవీణ్, శశిరేఖ, హరి, గోపీ, శివ, నాగభూషణం, గోవర్ధన్, లాజరస్, ఉమా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

విద్యాకేంద్రంలో రోడ్లు ఛిద్రం



ఏర్పేడులోని వెంకటగిరి రోడ్డు దుస్థితి

ఏర్పేడు: ఐఐటీ, ఐజర్ జాతీయ స్థాయి విద్యాసంస్థలున్న ఏర్పేడులో రోడ్లు ఛిద్రం అయ్యాయి. ఆ విద్యాకేంద్రాలకు వెళ్లే మార్గం వెంకటగిరి రోడ్డులో ఆమందూరు వరకు రోడ్డు అంతా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనచోదకులకు ప్రయాణాన్ని నరకప్రాయం చేస్తోంది. తరచూ ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తేలికపాటి చినుకులకే ఆ గుంతలు వర్షపునీటితో నిండి ఎక్కడ లోతుగా ఉందో కూడా అర్థం కాని పరిస్థితిలో ప్రధానంగా ద్విచక్ర వాహనచోదకులు జారి పడుతున్నారు. ఆమందూరులో మురుగుకాలువలు లేకపోవడంతో రోడ్డుపై వర్షపు నీరు రోజుల తరబడి నిలిచి వాహనచోదకులకు ఇబ్బందిగా మారుతోంది. పాలకులు ఏర్పేడులో రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి యోగాకు మాన్యశ్రీ



మాన్యశ్రీతో యోగా సొసైటీ సభ్యులు

నాగలాపురం: పిచ్చాటూరు అరణియార్ యోగా–ధ్యాన సొసైటీకి చెందిన మాన్యశ్రీ యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని యోగా మాస్టర్ థామస్ తెలిపారు. ఆదివారం ఉదయం అరణియార్–యోగా ధ్యాన సొసైటీ కేంద్రంలో మాన్యశ్రీని మాస్టర్, సభ్యులు ఘనంగా సత్కరించారు. యోగా మాస్టర్ మాట్లాడుతూ మాన్యశ్రీ, తండ్రి ఆనంద్, చెల్లెలు యువశ్రీ యోగా కేంద్రంలో సభ్యులుగా ఉంటూ నిత్యం చక్కగా యోగా సాధన చేస్తున్నారన్నారు.

ఘనంగా కావమ్మ తిరునాళ్లు



కావమ్మ దేవత

వరదయ్యపాళెం: మండలంలోని కోవూరుపాడులో కావమ్మ తిరునాళ్లు అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలో శుక్రవారం నుంచి మొదలైన వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం అగ్నిగుండ ప్రవేశంతో పరిపూర్ణం కానున్నాయి. శుక్రవారం రాత్రి కావమ్మ, మారెయ్యల కల్యాణం, శనివారం రాత్రి స్వామి అమ్మవార్లకు సారె అందజేశారు. ఆదివారం అగ్నిగుండ ప్రవేశానికి సంబంధించి ముందుగా గ్రామ పురవీధుల్లో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఆలయ ధర్మకర్తలు సామర్ల మునెమ్మ, నాగభూషణం దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గాయపడిన వ్యక్తి మృతి

రేణిగుంట: బైక్ ఢీ కొన్న ఘటనలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడని గాజుల మండ్యం ఎస్ఐ సుధాకర్ తెలిపారు. తిరుపతి–చెన్నై ప్రధాన రహదారి అల్లికేశం వద్ద మూడు రోజుల కిందట రోడ్డు దాటుతున్న గిరి (60)ని పుత్తూరు నుంచి వస్తున్న బైక్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.